చందానగర్‌లో రెండు మహిళాశక్తి క్యాంటీన్లు



పనులను పరిశీలిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి క్యాంటిన్ల ఏర్పాటు నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ చందానగర్‌ సర్కిల్‌ -21 కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహిళా శక్తి క్యాంటిన్‌ పనులను శనివారం ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్‌ సర్కిల్‌ పరిధిలో రెండు మహిళా శక్తి క్యాంటిన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ క్యాంటీన్ల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ తరఫున స్థలాన్ని ఎంపిక చేస్తున్నామన్నారు. అక్కడ మహిళలు బ్యాంకు రుణాలతో షెడ్డును ఏర్పాటు చేసుకొని కావలసిన సామగ్రిని కొనుగోలు చేసుకోవాలని సూచించారు. త్వరలోనే పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ చేతుల మీదుగా క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని డీసీ మోహన్‌రెడ్డి తెలిపారు. అనంతరం క్యాంటీన్‌ నిర్వాహకురాలు నాగమణి మాట్లాడుతూ సుమారు రూ.8 లక్షలతో మహిళా శక్తి క్యాంటిన్‌ను నెలకొల్పుతున్నామన్నారు.

‘వైబ్రెంట్‌ ఫెస్ట్‌-2024’ పోటీల విజేతలు వీరే..

రాయదుర్గం: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక ఆతిథ్య కేంద్రమైన గచ్చిబౌలి నిథమ్‌లో నిర్వహించిన పోటీలు ముగిశాయి. విజేతలను శనివారం ప్రకటించారు. ‘టూరిజమ్‌ అండ్‌ పీస్‌’ అనే ఇతివృత్తంతో జరిగిన ఈ పోటీలలో 80 మంది విద్యార్థులు పలు రకాల పోటీలలో పాల్గొని తమ సత్తాను చాటారు. టూరిజంపై క్విజ్‌ ఆరు థ్రిల్లింగ్‌ రౌండ్‌లను నిర్వహించారు. ఈ పోటీలో సౌర్యజ్యోతి బక్సీ, కిరణ్‌కుమార్‌ యాదవ్‌ విజేతలుగా నిలిచారు. కాగా బీబీఏ విద్యార్థులు సౌమిత్‌, నిత్య రన్నరప్‌గా నిలిచారు. మరోపోటీలో విజేతగా పవిత్ర, రన్నరప్‌గా ధరణిహ నిలిచింది. టూరిజమ్‌–పీస్‌ అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో విజేతగా షీన్‌, రన్నరప్‌గా ఆద్య నిలిచారు. టాలెంట్‌షోలో అనంత కృష్ణ మృదంగం వాయించి అందరినీ ఆకట్టుకున్నారు. రన్నరప్‌గా భక్తిమోహన్‌ నిలిచారు.ముకుంద్‌సాయి విభిన్న వాయిద్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. విజేతలను నిథమ్‌ డైరెక్టర్‌, ఐఏఎస్‌ అధికారి ఈలాత్రిపాఠి అభినందించారు.

అలరించిన నృత్యప్రదర్శన



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం శ్రీనృత్య అకాడమీ గురువు ప్రత్యూష శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో వినాయకకౌతం, స్వరపల్లవి, జతిస్వరం, ముద్దుగారే యశోద, రామాయణ శబ్దం, గణపతి కీర్తన, శ్రీరామ సరస్వతి, తదితర అంశాలను ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్యస్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రచోదన్‌ మ్యూజిక్‌ అకాడమీ స్వరార్చన కార్యక్రమంలో ఎండగాని, అన్ని మంత్రములు, ఆరగించి తదితర కీర్తనలను ఆలపించారు. తబలా సాయినారాయణ, కీబోర్డు గురుప్రసాద్‌ వాద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను డాక్టర్‌ శోభారాజు సత్కరించారు.

బాక్స్‌టైప్‌ డ్రైన్‌ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద కొనసాగుతున్న బాక్స్‌ టైప్‌ డ్రైన్‌ పనులను జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌లతో కలిసి ఎమ్మెల్యే గాంధీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బాక్స్‌ టైప్‌ కల్వర్టు పనులు పూర్తి అయ్యాయని, బాక్స్‌టైప్‌ డ్రైన్‌ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ జీకె దుర్గా ప్రసాద్‌, డీఈలు ఆనంద్‌, దుర్గా ప్రసాద్‌, ఏఈలు భాస్కర్‌, సంతోష్‌ రెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు వీరేశంగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌ సోఫా కాలనీలో త్వరలో పర్యటిస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. గోపన్‌పల్లిలోని సోఫా కాలనీవాసులు శనివారం ఎమ్మెల్యే గాంధీని మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలో కలిసి బస్తీలోని సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోఫా కాలనీలో అసంపూర్తి రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. మంచి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన నీటి సరఫరా అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ, వేణుగోపాల్‌రెడ్డి, కాలనీవాసులు గురవయ్య, లాల్సింగ్‌ నాయక్‌, కిరాణం రాజు, బుజ్జిబాబు, హరీష్‌, భద్రు, స్థానికులు పాల్గొన్నారు.

హృద్రోగ సమస్యలతో పెరుగుతున్న మరణాలు



సీపీఆర్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న సంగీతారెడ్డి



మాదాపూర్‌లోని మెడికవర్‌ ఆసుపత్రిలో..

- హెచ్‌ఐసీసీలో హృదయ సంబంధ వ్యాధులపై సమ్మిట్‌
- పాల్గొన్న అపోలో ఆస్పత్రి ఎండీ సంగీతారెడ్డి

మాదాపూర్‌: హృద్రోగ సమస్యలతో అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని అపోలో ఆస్పత్రి మేనేజింగ్‌ డైరెక్టర్‌ సంగీతారెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శనివారం హృదయ సంబంధ వ్యాధులపై నిర్వహించిన సమ్మిట్‌లో ఆమె మాట్లాడుతూ గుండెపోటుతో మరణించే వారి సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా పాఠశాల విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కుటుంబ సభ్యులు, ప్రజలు శిక్షణ పొందడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అమెరికన్‌ హార్ట్‌ అసోసియేషన్‌ భారతదేశంలో మొదటి అంతర్జాతీయ శిక్షణా కేంద్రాన్ని హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్‌కేర్‌ క్వాలిటీ సమ్మిట్‌ 2024 చైర్‌ పర్సన్‌ డాక్టర్‌ ఇమ్రాన్‌ సుభాన్‌, అమెరికన్‌ హార్ట్‌ అసోసియేషన్‌ రీజినల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సచిన్‌మీనన్‌, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

మెడికవర్‌ ఆసుపత్రిలో..

యువత కూడా గుండె జబ్బుల బారిన పడుతున్నారని డాక్టర్‌ అనిల్‌కృష్ణ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్‌ ఆస్పత్రిలో ఈడీ(ఆటోమేటెడ్‌ ఎక్స్‌టర్నల్‌ డీఫ్రిబిలేటర్‌) డివైస్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవితం ఇందుకు ప్రధాన కారణాలన్నారు. మెడికల్‌ డైరెక్టర్‌ సతీష్‌కుమార్‌ మాట్లాడుతూ ఏఈడీలతో మరణాల శాతంను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో మెడికవర్‌ ఆస్పత్రి డైరెక్టర్‌ డాక్టర్‌ శరత్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితురాలికి జరిమానా, జీవిత ఖైదు

చందానగర్‌: ఓ హత్య కేసులో నిందితురాలికి రూ.3వేల జరిమానాతో పాటు జీవిత ఖైదు విధించారు కూకట్‌పల్లి మెట్రోపాలిటన్‌ కోర్టు న్యాయమూర్తి పావని. వివరాలిలా.. చందానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని నల్లగండ్ల లక్ష్మీ విహార్‌ ఫేజ్‌-2లో 2016వ సంవత్సరంలో సెప్టెంబర్‌ 9వ తేదీ ఉదయం మానెం శ్రీనివాస్‌ ,భార్య విధులకు వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి పక్కనే ఉన్న రామమూర్తి ఇంట్లో నుంచి శబ్దాలు వస్తున్నాయని శ్రీనివాస్‌కు తెలుపగా వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకుని చూడగా శ్రీనివాస్‌ తల్లి ఉమాదేవి రక్తపు మడుగులో పడి ఉంది. పక్కనే ఇంట్లో పనిచేసే గడ్డం వసుంధర (20)కూడా పడి ఉంది. వారిద్దరిని చికిత్స కోసం పక్కనే ఉన్న సిటిజన్‌ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ఉమాదేవి మృతి చెందిందని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారించగా పనిమనిషి వసుంధర వృద్ధురాలు ఉమాదేవిపై దాడి చేసి బంగారు చంద్రహారం, 6 బంగారు గాజులు, లక్ష రూపాయలు కాజేసింది. దీంతో పోలీసులు సెప్టెంబర్‌ 21వ తేదీ పనిమనిషి వసుంధరను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్‌





మాదాపూర్‌లోని చందానాయక్‌తండాలో మూతలేని మ్యాన్‌హోల్స్‌

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- వెంటనే సమస్యను పరిష్కరించాలంటున్న స్థానికులు



మాదాపూర్‌: ఐటి ప్రాంతం మాదాపూర్‌లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మాదాపూర్‌లోని సాయినగర్‌, చందానాయక్‌ తండా, అయ్యప్పసొసైటీ, సర్వే ఆఫ్‌ ఇండియా తదితర ప్రాంతాలలో అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మాదాపూర్‌ ఐటీ ప్రాంతం కావడంతో హాస్టల్స్‌ ఇబ్బడిముబ్బడిగా వెలవడంతో సమస్య ఏర్పడుతోంది. డ్రైనేజీ పైపులు సంవత్సరాల క్రితం వేసినవి కావడంతో ఎక్కడికక్కడ మ్యాన్‌హోల్స్‌ నుంచి మురుగునీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఇక పగిలిపోయిన మ్యాన్‌హోల్స్‌ మూతలు సరిచేయకపోవడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. అసలే వర్షాకాలం కావడంతో రోడ్లపై వర్షపు నీటితో పాటు మురుగునీరు చేరడం..ఎక్కడ గుంతలు ఉన్నయో తెలియకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు తెలిపారు. మురుగు నిలవడంతో ఈగలు, దోమలు ప్రబలి విషజ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.







మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీలో..

రెహమాన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ పరిశోధక విద్యార్థి అసదుర్‌ రెహమాన్‌కు శనివారం పీహెచ్‌డీని ప్రకటించారు. పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ అహ్మద్‌రజా పర్యవేక్షణలో ‘జమ్ముకశ్మీర్‌లో చైల్డ్‌ వెల్ఫేర్‌ అడ్మినిస్ట్రేషన్‌ స్థితి: పూంచ్‌ జిల్లా యొక్క కేస్‌ స్టడీ’ అనే అంశంపై థీసిస్‌ను సమర్పించగా పీహెచ్‌డీని ప్రకటించారు.

అపర్ణ గ్రాండేలో ఓనం సంబరాలు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ గ్రాండే సముదాయంలో శనివారం ఓనం సంబరాలు నిర్వహించారు. కృష్ణ ప్రసాద్‌, అయిజా పాల్‌, డాక్టర్‌ ప్రియ నాయర్‌, అన్నా మేరీల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కేరళ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో తెయ్యం నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కార్పొరేటర్‌ సమీక్ష



మియాపూర్‌: మియాపూర్‌ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌ శ్రీకాంత్‌ అన్నారు. శనివారం మియాపూర్‌ మయూరినగర్‌లోని జలమండలి కార్యాలయంలో డీజీఎం వెంకటేశ్వరరావు, మేనేజర్‌ సునీతతో డ్రైనేజీ, నీటి సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్‌ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రైనేజీ పనులు పూర్తి చేయాలన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన మంచినీటి పైప్‌లైన్‌ నిర్మాణం కోసం అదనంగా నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని మంచినీటి సరఫరా సమయాన్ని పెంచాలని సూచించారు.

21 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 21 మందికి జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో 21 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శనివారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 21 మందికి ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

భగత్‌సింగ్‌ జయంతి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పట్టణంలోని సాయినగర్‌ కాలనీలో భగత్‌సింగ్‌ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు బలరాం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని భగత్‌సింగ్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మారుస్తాం

గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి



కేశవనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో అంతర్గత రోడ్లను దశలవారీగా సీసీరోడ్లుగా మారుస్తామని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవనగర్‌, గౌలిదొడ్డిలో రూ.50 లక్షలతో నూతనంగా చేపట్టే సీసీరోడ్డు పనులను శనివారం స్థానికులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత తప్పనిసరి అని అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, భిక్షపతి, శేఖర్‌, బాలకృష్ణ, హన్మంతు, గణేష్‌, సుమన్‌, ప్రసాద్‌, శ్రీనివాస్‌, రాజు, గోవింద్‌, నగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.5 లక్షలు విరాళం

చందానగర్‌: మదీనాగూడ మై హోమ్‌ జువెల్‌ అపార్ట్‌మెంట్‌వాసులు వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి రూ.5 లక్షలు విరాళాన్ని శనివారం అందజేశారు. మదీనాగూడలోని మై హోమ్‌ జువెల్‌ అపార్ట్‌మెంట్‌లో వినాయకచవితి సందర్భంగా వేలంలో లడ్డూ రూ.5 లక్షలు పలికింది. ఆ డబ్బును ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి అందజేశారు. ఈ సందర్భంగా మైహోమ్‌ జువెల్‌ ఫ్లాట్‌ ఓనర్స్‌ అసోసియేషన్‌ సొసైటీ లిమిటెడ్‌ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

కార్యక్రమంలో కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, కరుణాకర్‌ రెడ్డి, ప్రసాద్‌, మై హోమ్‌ జువెల్‌ ఫ్లాట్‌ ఓనర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు ప్రశాంత్‌, మురళీధర్‌రావు, మహేష్‌ బాబు, రవికుమార్‌, రాజేంద్రన్‌, మురుగేశన్‌, ఎమ్‌ఎస్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌ 10న సద్దుల బతుకమ్మ

- 12న దసరా
- పట్టణ ప్రముఖుల సమావేశంలో నిర్ణయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలో సద్దుల బతుకమ్మ పండగను అక్టోబర్‌ 10వ తేదీన, దసరా పండగను అక్టోబర్‌ 12వ తేదీన నిర్వహించుకోవాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించారు. శనివారం ఉదయం పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి ఆలయంలో పండగ తేదీలపై సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సద్దుల బతుకమ్మను అక్టోబర్‌ 10వ తేదీన పట్టణంలోని సాకి చెరువుకట్టపై నిర్వహించుకోవాలని తెలిపారు.దసరా పండగను అక్టోబర్‌ 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట ధ్వజారోహణ నిర్వహించి, జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్‌ ఫంక్షన్‌హాల్‌ ప్రాంగణంలో శమీ చెట్టుకు పూజలు చేయాలని నిర్వహించారు. అనంతరం సాయంత్రం7 గంటలకు మైత్రి మైదానంలో రావణాసుర దహనం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో పండుగలు నిర్వహించుకోవాలని, ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, మాజీ జడ్పీటీసీలు జైపాల్‌, మాణిక్యం, మాజీ కార్పొరేటర్‌ శంకర్‌ యాదవ్‌, గూడెం మధుసూదన్‌ రెడ్డి, ప్రకాష్‌రావు, ప్రతాప్‌గౌడ్‌, పురోహితులు పాల్గొన్నారు.

‘లోన్లీ ప్లానెట్‌ -2 గ్రూప్‌’ ఎగ్జిబిషన్‌

మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీలో శనివారం ఏర్పాటు చేసిన లోన్లీ ప్లానెట్‌ -2 గ్రూప్‌ ఎగ్జిబిషన్‌ను ఆర్ట్‌ గ్యాలరీ డైరెక్టర్‌ డాక్టర్‌ కె.లక్ష్మీ, కళాకారిణి అంజుపోద్దార్‌లు ప్రారంభించారు. ఈ ప్రదర్శన అక్టోబర్‌ 6వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. – మాదాపూర్‌





ట్రాఫిక్‌ ఆంక్షలు ..

గచ్చిబౌలి: 10కె రన్‌ సందర్భంగా ఆయా రూట్లలో ట్రాఫిక్‌ ఆంక్షలు విధిస్తున్నట్లు సైబరాబాద్‌ ట్రాఫిక్‌ జాయింట్‌ సీపీ జోయల్‌ డేవిస్‌ తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి 8.30 గంటల వరకు గచ్చిబౌలి గేట్‌ నంబర్‌–1 నుంచి 10కె రన్‌ ప్రారంభమై ట్రిపుల్‌ ఐటీ జంక్షన్‌, విప్రో సర్కిల్‌, ఐఎస్‌బీ, టీఎన్‌జీఓస్‌ కాలనీలో యూటర్న్‌ తీసుకొని ట్రిపుల్‌ ఐటీ జంక్షన్‌, గచ్చిబౌలి స్టేడియానికి చేరుకుంటారు. 5కె రన్‌ గచ్చిబౌలి స్టేడియం నుంచి ట్రిపుల్‌ ఐటీ జంక్షన్‌, ఐఎస్‌బీ, గచ్చిబౌలి స్టేడియానికి చేరుకుంటుంది. 3కె రన్‌ గచ్చిబౌలి స్టేడియం నుంచి ట్రిపుల్‌ ఐటీ జంక్షన్‌, పుల్లెల గోపీచంద్‌ అకాడమీ వద్ద యూ టర్న్‌ తీసుకుని స్టేడియానికి చేరుకుంటుంది. గచ్చిబౌలి జంక్షన్‌, ఇందిరానగర్‌, ట్రిపుల్‌ ఐటీ జంక్షన్‌, గచ్చిబౌలి స్టేడియం, హెచ్‌సీయూ గేట్‌ నంబర్‌ -2 వాహనాలను అనుమతించరు. ఓఆర్‌ఆర్‌ నుంచి లింగంపల్లి వైపు వెళ్లే వాహనాలు గచ్చిబౌలి జంక్షన్‌ నుంచి బొటానికల్‌ గార్డెన్‌, మసీద్‌బండ మీదుగా హెచ్‌సీయూ డిపో మీదుగా వెళ్లాలి. లింగంపల్లి నుంచి గచ్చిబౌలి జంక్షన్‌కు రావాల్సిన వాహనాలు హెచ్‌సీయూ డిపో వద్ద లెఫ్ట్‌ తీసుకుని మసీద్‌బండ, బొటానికల్‌ గార్డెన్‌, గచ్చిబౌలి జంక్షన్‌కు చేరుకోవాలన్నారు. గోపన్‌పల్లి, గౌలిదొడ్డి, విప్రో సర్కిల్‌ నుంచి ట్రిపుల్‌ ఐటీ వైపు వచ్చే వాహనాలు విప్రో సర్కిల్‌ నుంచి నుంచి నేరుగా నానక్‌రాంగూడ రోటరీ, గచ్చిబౌలి జంక్షన్‌కు చేరుకోవచ్చన్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి పోలీసులకు సహకరించాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

రాయదుర్గం: శ్రీకృష్ణ యూత్‌ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని మండపం వద్ద వాటర్‌ ట్యాంకర్‌ సమీపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్‌కెవై టీమ్‌ అధ్యక్షుడు అభిషేక్‌ గౌడ్‌ తెలిపారు. అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్‌ చెకప్‌, కొలెస్ట్రాల్‌ టెస్ట్‌, డెంటల్‌ చెకప్‌, కంటి పరీక్షలు, ఈఎన్‌టీ చెకప్‌, స్కిన్‌, ఈసీజీ పరీక్షలు చేయబడతాయని ఆయన వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామ సమీపంలోని తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల (పురుషుల) లో 2024 -25 సంవత్సరానికి బీఎస్సీ(ఎంపీసీ, ఎంఎస్సీఎస్‌ , ఎంఎస్సీఎస్‌, బీజెడ్సీ, బీకాం (సీఏ), (హానర్స్‌) గ్రూపులలో ప్రవేశాలకు విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్‌, రంగారెడ్డి, సంగారెడ్డి రీజనల్‌ కోఆర్డినేటర్‌ సుధాకర్‌, ప్రిన్సిపాల్‌ మహేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థులు దరఖాస్తు ఫారాలను, ఒరిజినల్స్‌ను కళాశాలలో అందజేయాలన్నారు.ఎంపికైన విద్యార్థులకు ఉచిత హాస్టల్‌ వసతి, భోజనం, నోట్‌ బుక్స్‌ , బెడ్స్‌ , దుస్తులు మొదలైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9494824692, 9705992496, 8008070959 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దూరవిద్య కోర్సుల ప్రవేశాల గడువు పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్‌ ఫర్‌ డిస్టెన్స్‌ అండ్‌ ఆన్‌లైన్‌ ఎడ్యుకేషన్‌ (సీడీఓఈ) 2024-25 విద్యాసంవత్సరం అకడమిక్‌ సెషన్‌ కోసం ఓపెన్‌, డిస్టెన్స్‌ లెర్నింగ్‌ కోర్సుల అడ్మిషన్ల దరఖాస్తు గడువును పొడిగించినట్లు సీడీఓఈ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ మహ్మద్‌ రజావుల్లాఖాన్‌ శనివారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబర్‌ 10వ తేదీ వరకు అడ్మిషన్‌ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్‌ ఫీజు చెల్లింపునకు నవంబర్‌ 14వ తేదీ ఆఖరు అని తెలిపారు. ఈ ప్రాస్పెక్టస్‌, ఆన్‌లైన్‌ దరఖాస్తు ఫారం అడ్మిషన్‌ పోర్టల్‌లో అందుబాటులో ఉందన్నారు. మరిన్ని వివరాలకు.. స్టూడెంట్‌ సపోర్ట్‌ యూనిట్‌ (ఎస్‌ఎస్‌యూ) హెల్ప్‌లైన్‌లు ఫోన్‌ నంబర్‌ 040-23008463 లేదా 040-23120600 (ఎక్స్‌టెన్షన్‌ నంబర్‌ 2207, 2208)లలో సంప్రదించాలని సూచించారు.


స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



హెచ్‌సీయూలో ర్యాలీని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్‌ డాక్టర్‌ దేవేష్‌నిగమ్‌

రాయదుర్గం: సమాజ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని హెచ్‌సీయూ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ దేవేష్‌ నిగమ్‌ సూచించారు. శనివారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో స్వచ్ఛతా హీ సేవా-2024లో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్‌ హెచ్‌సీయూ సెల్‌ ఆధ్వర్యంలో క్యాంపస్‌ స్కూల్‌ విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ హెచ్‌సీయూ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ బి కృష్ణయ్య, క్యాంపస్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ పి మురళి, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ భీంసింగ్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు



బాస్కెట్‌ బాల్‌ ఆడుతున్న క్రీడాకారులు

శేరిలింగంపల్లి: విద్యార్థి దశలో క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు బాగుంటుందని ఎఫ్‌బీఐ మాజీ కమిషనర్‌ నార్మన్‌ ఇసాక్‌ పేర్కొన్నారు. ఇంటర్నేషనల్‌ స్కూల్‌ స్పోర్ట్స్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్‌ టోర్నమెంట్‌ శేరిలింగంపల్లిలోని చిరెక్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో క్రమశిక్షణ పాటించాలన్నారు. ఈ టోర్నీలో 53 స్కూల్స్‌నుంచి 125 జట్ల క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. అండర్‌-19, అండర్‌-14 బాలుర, బాలికల జట్లు ఈ టోర్నీలో పోటీ పడుతున్నాయన్నారు. జాతీయ బాస్కెట్‌బాల్‌ క్రీడాకారిణి పుష్పాసెంథిల్‌కుమార్‌ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల పట్ల కూడా విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. చిరెక్‌ ప్రిన్సిపాల్‌ సంచితరాహ, ఉపాధ్యాయులు, పీఈటీలు, కోచ్‌లు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

17 పబ్‌లపై కేసులు నమోదు

గచ్చిబౌలి: మాదాపూర్‌ జోన్‌లో వివిధ పోలీస్‌ స్టేషన్ల పరిధిలో 17 పబ్‌లపై కేసులు నమోదు చేసినట్లు మాదాపూర్‌ డీసీపీ వినీత్‌ తెలిపారు. గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్‌ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా 17 పబ్‌లకు లైసెన్స్‌లు లేవని, నిబంధనలకు విరుద్ధంగా సౌండ్‌ పొల్యూషన్‌ ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు.హైదరాబాద్‌ సిటీ పోలీస్‌ యాక్ట్‌ రెడ్‌విత్‌ సైబరాబాద్‌ పోలీస్‌ యాక్ట్‌-2004, సెక్షన్‌ 3(1) ప్రకారం కేసులు నమోదు చేసి సౌండ్‌ సిస్టమ్స్‌ స్వాధీనం చేసుకున్నామని డీసీపీ వివరించారు.